
ఓటరు నమోదులో ఉదాసీనత

- స్పెషల్ డ్రైవ్‌లో 65మంది ఓటర్లు మాత్రమే నమోదు
- ప్రచారంలో వెనుకబాటు
- వందల్లో పది, ఇంటర్ విద్యార్థులు
- మార్పులు చేర్పుల దరఖాస్తులు నిల్



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు రంజాని సురేశ్. ఊరు ముస్తాబాద్. 2018లో పదో తరగతి పూర్తి చేసిన సురేశ్‌కు 21 ఏళ్లు. ప్రస్తుతం ఇంటర్ కూడా పూర్తయ్యినా, ఇప్పటి వరకు ఓటు హక్కు రాలేదు. అదేలా అంటే ఓటర్ నమోదు ఎలాగో తనకు తెలియదంటున్నాడు. ఎవరికి సర్టిఫికెట్లు ఇవ్వాలో చెప్పలేదని అంటున్నాడు. 18 ఏళ్లు నిండినప్పుడు దరఖాస్తు చేసుకుంటే రెండుసార్లు ఓటు హక్కు వినియోగించుకునేవాడు. కానీ అలా సురేశ్‌కు ఎవరు అవగాహన కల్పించేవారు లేక ఓటరు కాలేకపోయాడు. ఒక్క సురేశ్ కాదు. ముస్తాబాద్ మండలంలో ప్రతి ఏడాది 18 ఏళ్లు నిండిన వారు ఇంటర్‌లో 400 మందికిపైగా ఉన్నారు. వీరందరికి ఏటా ఓటరుగా నమోదు చేయాల్సిన బాధ్యత అధికారులదే.



ఓటరు నమోదు పోర్టల్

ముస్తాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలంటే వయోజనులందరూ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. అర్హులైన అందరికి ఓటు హక్కు కల్పించడం ప్రభుత్వం బాధ్యత. అప్పుడే చట్టసభలకు మంచి నాయకులను పంపించిన వారమవుతాం. ఈనేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటు నమోదు ప్రక్రియ సజావుగా సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముస్తాబాద్ మండలంలో చేపట్టిన ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ తూతూమంత్రంగా సాగిందనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఓటరు నమోదు మామూలుగానే సాగినట్లు తెలుస్తోంది. బీఎల్‌వోలకు సరైన మార్గదర్శకాలు, ఆదేశాలు జారీ చేయలేదని భావిస్తున్నారు.

నమోదుకు ఫారాలు కరువు

ముస్తాబాద్ మండలంలో బీఎల్‌వోలకు ఓటర్ నమోదుకు సంబంధించిన ఫారాలు అందుబాటులో ఉంచలేదని అంటున్నారు. కొత్త ఓటరు నమోదుకు అవసరమైన ఫారం–06 సదరు యువకుడే తెచ్చుకోవాలి. అలాగే మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన ఫారం–07, ఫారం–08 కూడా సంబంధిత వ్యక్తులే సమర్పించాల్సి వుంటుంది. దీంతో ఓటర్లు తమకు ఎందుకు వచ్చిందిలే అని మిన్నకుంటున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు విధిగా ఓటరుగా నమోదు కావాలి. ఇంటింటికీ బీఎల్‌వోలు చేపట్టిన సర్వే సజావుగా సాగలేదు. మండుతున్న ఎండలతో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లలేదని తెలుస్తోంది. అలాగే అధికారులు ఓటు నమోదు కార్యక్రమంపై పెద్దగా ప్రచారం చేయలేదు.

ఓటర్ల నమోదు 65 మాత్రమే

గత మే 25 నుంచి జూన్ 23 వరకు ముస్తాబాద్ మండలంలో ఇంటింటా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో కొత్త ఓటర్లు అంటే ఫారం–06తో దరఖాస్తులు చేసుకున్న వారు కేవలం 65 మంది మాత్రమే. ఇక సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి దరఖాస్తులు ఒక్కటి కూడా రాలేదు. ఇదంతా ఓటర్లకు సరైన అవగాహన లేకపోవడం వల్లే జరిగిందని పెద్దగా చెప్పాల్సిన పనిలేదు. పోలింగ్ బూత్‌లలో, ఇంటింటి సర్వేలో కొంతమంది బీఎల్‌వోలు సరిగా పనిచేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి.


ఓటరు నమోదు పత్రం ఇస్తున్న మహిళ

ఓటు నమోదు ఇలా..

2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకుడు ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి అర్హులు. ఆన్‌లైన్‌లోను దరఖాస్తును ఫారం–06 ద్వారా చేయవచ్చు. లేదా బీఎల్‌వోలకు దరఖాస్తులు ఇవ్వొచ్చు. దీనికి ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి. అంటే ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, మూడు ఫొటోలు, వయసు నిర్ధారణకు ఎస్సెస్సీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు జతచేయాలి. అలాగే ఫారం–07 ద్వారా ఓటరు జాబితాల్లోంచి తొలగింపు, ఓటు ట్రాన్స్‌ఫర్ లాంటివి చేసుకోవచ్చు. ఫారం–08 ద్వారా సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ఫారం పూర్తి చేసిన వారు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించవచ్చు.

యువతకు అవగాహన కల్పించాలి



18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించాలి. ఇందు కోసం కళాశాలల్లో సమావేశాలు నిర్వహించాలి. సమర్థులైన పాలకులను ఎన్నుకునే అవకాశం ఓటర్లకు మాత్రమే ఉంది. దానిని సద్వినియోగం చేసుకోవాలి.

– చిరుత వెంకన్న, కొండాపూర్

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



ఓటరు నమోదు నిరంతరం జరిగే ప్రక్రియ. బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని చెప్పాం. ప్రత్యేక సర్వేను సైతం చేపట్టాం. ఇందుకోసం తల్లిదండ్రులు, రాజకీయ పార్టీలు కూడా సహకరించాలి. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఓటరు నమోదును ప్రోత్సహిస్తున్నాం.

– మునిందర్, తహసీల్దార్, ముస్తాబాద్

క్లుప్తంగా

భూ నిర్వాసితులకు పట్టాలు పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు, సర్దాపూర్ శివారులో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మోడల్ లే అవుట్ ఏర్పాటు కోసం భూ సేకరణలో భాగంగా భూమిని కోల్పోయిన రైతులకు ప్రొవిజనల్ పట్టాలను చైర్‌పర్సన్ జిందం కళ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, చెన్నమనేని కీర్తి, లింగంపల్లి సత్యనారాయణ, అన్నారం శ్రీనివాస్, పెద్దూరు ప్యాక్ చైర్మన్ జీల కిషన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బండ మల్లేశం

వేములవాడరూరల్: అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుకుంటున్న చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు నిర్వాహకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఆరోగ్య, పోషణ్ దినంపై ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రత్యేక సభలు నిర్వహించి వీటిపై కార్యదర్శులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జెడ్పీటీసీ వాణి, సీడీపీవో ఎల్లయ్య, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందజేస్తుందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి బ్లీచింగ్ వేయాలన్నారు. ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ కనకమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మగర్జన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

సిరిసిల్లఅర్బన్: బ్రాహ్మణులు తమ హక్కుల కొరకు హైదరాబాద్‌లో ఈనెల 9న నిర్వహించనున్న బ్రహ్మగర్జన బహిరంగ సభకు సంబంధించి పోస్టర్‌ను బ్రహ్మగర్జన సేవా బాధ్యులు మంగళవారం ఆవిష్కరించారు. బ్రహ్మగర్జనకు అధిక సంఖ్యలో బ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంతోష్‌శర్మ, శశికాంత్, నరేందర్, శ్రీనివాస్, జయసారథి, ప్రవీణ్, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి


బోయినపల్లి: విలాసాగర్‌లో..


చందుర్తిలో..


ఎల్లారెడ్డిపేటలో..

బోయినపల్లి: గ్రామ, గ్రామాన దొడ్డి కొమురయ్య విగ్రహాలను నెలకొల్పాలని కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య అన్నారు. మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొని ఆ కాలంలోనే రైతులను సంఘటిత పరిచాడని కొనియాడారు. కార్యక్రమంలో ఏనుగుల ప్రశాంత్‌కుమార్, ఏనుగుల అనీల్‌కుమార్, గొట్ల భూమయ్య, కొమురయ్య, కుర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, గొల్లకుర్మల సంఘం మండల అధ్యక్షుడు మెండే శ్రీనివాస్, ఎంపీటీసీ అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ చైర్మన్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్ సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్ విండో అధ్యక్షులు తిప్పని శ్రీనివాస్, డైరెక్టర్లు మింగని రవి, పోతురాజు నగేశ్, కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చిత్రకథ



సమయపాలన ఎక్కడ?

వేములవాడరూరల్: అత్యవసర సేవలందించే విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉద్యోగుల సమయపాలన కొట్టచ్చినట్లు కనబడుతోంది. వేములవాడ రూరల్ సెస్ కార్యాలయంలో 10 గంటలు దాటినా కానీ ఒక్క ఉద్యోగి రాలేదు. దీంతో గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన పలువురు సిబ్బంది లేక తిరిగి వెళ్లిపోయారు. అత్యవసర శాఖలో విధులు నిర్వహించే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అంజయ్య

వీర్నపల్లి: మండల కేంద్రంలో వెంకట్‌రాయిని చెరువులో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం భూములు కోల్పోతున్న రైతుల భూములు సర్వే చేయించి ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. మంత్రి కేటీఆర్ ఇలాకాలో రైతులు కంట నీరు పెట్టించడం సరికాదన్నారు. వెంటనే రైతులకు పరిహారం ఇవ్వలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న రుద్రంగి ఎంపీడీవో శంకర్

రుద్రంగి: వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధతో, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మాలోతు శంకర్ అన్నారు. స్థానిక రైతు వేదికలో అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ ఆరోగ్య, న్యూట్రీషియన్ కమిటీతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య, మెడికల్ ఆఫీసర్ సంపత్, ఎంపీవో సుధాకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మమత, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ ఆరోగ్య, న్యూట్రీషియన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వీర్నపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీడీపీవో ఆనందిని అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ శానిటేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని ఎప్పటికప్పుడు రోడ్లపై మురుగు నీటి కాలువలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మంచి ఆహారం తీసుకోవాలని ప్రజలకు సూచించాలని ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేశ్, ఇన్‌చార్జి మెడికల్ అధికారి చిరంజీవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, ఏపీవో శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత


ప్రొసీడింగ్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోనరావుపేట: మండలం శివంగాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల ప్రొసిడింగ్ కాపీని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మంగళవారం అందజేశారు. గ్రామంలో ఇదివరకున్న గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసి విన్నవించడంతో నిధులు మంజూరు చేశారు

పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందివ్వాలి


మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: ర్యాంకులతో సంబంధం లేకుండా ఇంజినీరింగ్ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందివ్వాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. మంగళవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రభుత్వం విధించిన 10 వేల ర్యాంకు కొర్రీని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు ఇల్లందుల ప్రకాశ్, నవీన్‌కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధికార మార్పిడికి ప్రజలు సిద్ధం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చక్రధర్‌రెడ్డి


ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలో దొరల గడీల పాలనకు ప్రజలు చరమగీతం పాడి అధికార మార్పిడికి సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కనిమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై కరపత్రాలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. కుటుంబ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, నాయకులు వంగ బాపురెడ్డి, భాస్కర్, రాకేశ్, వినోద్, వినయ్, దేవేందర్, బండి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ట్రిపుల్‌ఐటీకి నలుగురు విద్యార్థుల ఎంపిక

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. కడవేరుగు సుప్రియ, షేక్ నస్మీన్, షేక్ సాదియ, దొంతుల భానుతేజలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. వారిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

బీజేపీకి రాజీనామా

ముస్తాబాద్: బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. పార్టీలో అవకాశాలు కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ ప్రాంతం, జాత్రాగ్రౌండ్ ప్రాంతాల్లో ఉండే పేదలకు మంగళవారం మై వేములవాడ ట్రస్టు సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఆర్డీవో సందర్శన

బోయినపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ సందర్శించారు. మండలంలో రెవెన్యూ సంబంధిత అంశాల గూర్చి తహసీల్దార్ దర్పెల్లి నరేశ్‌తో చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.

బస్‌పాస్‌లు అందజేత

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి(వట్టిమల్ల) గ్రామంలోని 60 మంది విద్యార్థులకు సర్పంచ్ గోపు పర్శరాములు సొంత ఖర్చులు పెట్టుకుని మంగళవారం బస్‌పాసులను అందజేశారు. కార్యక్రమంలో వేములవాడ డిపో మేనేజర్ మురళీకృష్ణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్, పీఆర్వో శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కోనరావుపేట: మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన రాయిని అంజలికి రూ. 27 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అందజేశారు.

రైతు రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు మ్యాకల మల్లేశం అన్నారు. నాలుగున్నరేళ్లు కావస్తున్న రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీసుకున్న రుణాలు వడ్డీతో కలిపి కుప్పలుగా పెరిగిపోతున్నాయని, ఈ నెలాఖరులోగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

వీర్నపల్లి: రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని మద్దిమల్ల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కోతి జయంత్ జయంత్ తల్లిదండ్రులను బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు లగిసెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేశ్, మల్లేశం, వినోద్, రమేశ్, తిరుపతి, మహేశ్ పాల్గొన్నారు.

నియామకం

గోపాల యూత్ కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు గోపాల యూత్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడుదుల మహేందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు సలేంద్రి విజయ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మేడుదుల రేవంత్‌యాదవ్, కోశాధికారి ముష్కం వెంకటేశ్‌యాదవ్, కార్యదర్శి గోడుగు మధు యాదవ్‌ను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె బాట


ఎంపీడీవోకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు లద్దూరి నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో నరేశ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.19 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60లో పేర్కొన్న వేతనాల్లో కేటగిరీ వారీగా పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.15,600 చెల్లించాలని, అలాగే పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్, బిల్ కలెక్టర్ ఇతర స్కేల్ సిబ్బందికి రూ.19.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

వేములవాడఅర్బన్: తెలంగాణ ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్టీవో మహ్మద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి పంజల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెల్త్ స్కీంతో అన్ని కార్పొరేట్ వైద్యశాలలో నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అన్ని జిల్లాల్లో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మధుకర్, అనందచారి, అనందరెడ్డి, దేవయ్య పాల్గొన్నారు.

గౌడ సంఘం బోనాలు


బోనాలతో వెళుతున్న గౌడ సంఘం నాయకులు

వేములవాడ: వేములవాడ పట్టణంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. దారిపొడవునా ఎల్లమ్మ గడతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక


వేములవాడఅర్బన్: ఎంపికైన విద్యార్థులు

వేములవాడఅర్బన్/ముస్తాబాద్/చందుర్తి: హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతిలో ప్రవేశాలకు ముస్తాబాద్, వేములవాడ, చందుర్తిలో మంగళవారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈవోలు భూక్య బన్నాజీ, శ్రీనివాసదీక్షితులు, పీడీ బుచ్చిరెడ్డి తెలిపారు. రన్నింగ్, షార్ట్‌పుట్, హైజంప్ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వేములవాడలో 50 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 30 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎంలు విఠల్‌నాయక్, తిరుపతి, లక్ష్మీనారాయణ, రవి, పీడీ హామీద్, పీఈటీలు సురేశ్, శ్రీనివాస్, పర్శరాం, రాజు, రాజశేఖర్, సంధ్యారాణి, రాజేందర్, భానురేఖ, విజయ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.